ఓంటెల్‌గడ్డ తండాలో ఎడ్ల బండ్లకు స్వాగతం పలుకుతున్న డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు, తండాకు చెందిన మహిళా రైతులు

పాత పంటల సంరక్షణే లక్ష్యం

జహీరాబాద్, జనవరి 28: పాత పంటలను రక్షించి భావితరాలకు అందించడమే లక్ష్యంగా డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు కృషి చేస్తున్నారని జహీరాబాద్ పట్టణ సమీపంలోని పస్తాపూర్ డెక్కన్ డెవలప్‌మెంట్ పాత పంటల జాతర కోఆర్డినేటర్లు వినయ్ కుమార్, మంజుల పేర్కొన్నారు. మంగళవారం మొగుడంపల్లి మండలంలోని ఓంటెల్ గడ్డ తండాలో డీడీఎస్ ఆధ్వర్యంలో 25వ పాత పంటల జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో వారు మాట్లాడుతూ పాత పంటలైన తైదలు, కొర్రలు, సామలు, రాగులు, అవిసలు, సజ్జ, జొన్న, పెసర, మినుము తదితర పంటలతో అనేక ప్రయోజనాలుంటాయన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త హేమలత కాలానుగుణంగా మారుతున్న ఆహారపు అలవాట్లతో ప్రస్తుతం ప్రజలు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పూర్వకాలంలో చిరుధాన్యాలతో వంటలు చేసుకుని తిన్నవారు నేటికి అరోగ్యంగా ఉన్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతిఒక్కరూ పాతపంటలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం తండాలో పాతపంటల విత్తనాలతో అలంకరించిన ఎడ్లబండ్ల ఊరేగింపును నిర్వహించారు. మహిళా సంఘాల సభ్యులు, మహిళలు చేపట్టిన కోలాటం, చిటికెల రామాయణం, ఆట పాటలు తండావాసులకు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీడీఎస్ లైజర్ ఆఫీసర్ మాణిక్యం, మహిళా సంఘాల సభ్యులు నర్సమ్మ, చుక్కమ్మ, విజయలక్ష్మి, అనురాధ, లాలిబాయి, మోతిబాయి, మహిళా రైతులు పాల్గొన్నారు.

అందోల్: మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

అందోల్, జనవరి 28: కాంగ్రెస్ నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు మంగళవారం మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. అందోల్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 6వ వార్డుకు చెందిన దాసరి మల్లేశం, ఎలగోరి నరేశ్, కుమ్మరి అశోక్, బోయిని అశోక్, బద్రి లక్ష్మణ్ తదితరులు బీఆర్ఎస్‌లో చేరగా వారికి మాజీ ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలతోపాటు...ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సైతం నమ్మకం పోయిందన్నారు. అమలుకు సాధ్యంకానీ హామీలిచ్చి ప్రజలకు ఏ ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు చేయడం లేదని మండిపడ్డారు. అడ్డగోలు హామీలిచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించారని, ఇప్పుడూ కూడా ఇంకా అదే మార్గంలో వెళ్తున్నారన్నారు. సీఎంతోపాటు మంత్రులు పొంతనలేని మాటాలు మాట్లాడుతున్నారని గ్రామసభల పేరుతో మళ్లీ మళ్లీ దరఖాస్తులు స్వీకరించిన ప్రజలకు మాత్రం ఇస్తామన్న పథకాలు అందడంలేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామాగౌడ్, వెంకటేశం, నాగరత్నం గౌడ్, సంతోశ్, గోపాల్, లక్ష్మణ్, సత్యం, శేఖర్, రాజ్‌కుమార్, బీర్లశంకర్, రాజు, దుర్గేశ్, కరుణాకర్, పరిపూర్ణం పాల్గొన్నారు.

తూతూమంత్రంగా టెన్త్ ప్రత్యేక తరగతులు

మునిపల్లి ఆదర్శ పాఠశాలలో కనిపించని ప్రత్యేక తరగతులు

మునిపల్లి, జనవరి 28: ప్రభుత్వ బడుల్లోని పదోతరగతి విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించాలని ప్రభుత్వం జిల్లా పరిషత్ ప్రభుత్వ బడుల్లో పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాలను మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు పాటించకుండా ప్రత్యేక తరగతులు నిర్వహించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ బడుల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉదయం 8:15 నుంచి 9:15వరకు, సాయంత్రం 4:15 నుంచి 5:15 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించాల్సిన ఉన్నప్పటికీ ఉపాధ్యాయులు సాయంత్రం 4:15కు తరగతులు ప్రారంభించి ఫొటోలు దిగుతూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు వ్యవహరిస్తున్నారు. మంగళవారం మునిపల్లి ఆదర్శ పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతి నిర్వహిస్తున్నట్లు ఫొటోలు దిగి సాయంత్రం 4:40నిమిషాలకు పాఠశాల నుంచి టెన్త్ విద్యార్థులను పంపించి ఉపాధ్యాయులు సైతం వెళ్లిపోయారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు ప్రభుత్వం ఓ వైపు చర్యలు తీసుకుంటుంటే ఉపాధ్యాయులు మాత్రం ప్రభు త్వ ఆదేశాలు లెక్కచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సాయంత్రమే ఇలాఉంటే... ఉదయం పరిస్థితి ఏందని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఆదర్శ పాఠశాలల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా మాకు సమాచారం లేదు..ఏం జరిగిందో తెలుసుకొని చెప్తా అనడం విడ్డురంగా ఉంది. ప్రత్యేక తరగతుల నిర్వహణపై నిర్లక్ష్యం చేస్తున్న సంబంధిత ఉపాధ్యాయులపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

కుక్కల స్వైర విహారం

14మందికి తీవ్రగాయాలు

కంగ్టి, జనవరి 28: మండలకేంద్రమైన కంగ్టిలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎన్నిసార్లు పంచాయతీ అధికారులకు మొర పెట్టుకున్నా వారు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడంతో కుక్కలు మనషులను తీవ్రంగా గాయపరుస్తున్నాయి. మంగళవారం కంగ్టిలో ఓ కుక్క 14 మందిని కరవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కరిచిన వారిలో పిల్లలు, పెద్దలు, వృద్ధులు ఉన్నారు. వెంటనే వారంతా స్థానిక దవాఖానలో రెబీస్ ఇంజక్షన్‌ను వేయించుకున్నారు. దీంతో అధికారుల తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం అవుతున్నాయి. గతంలో గ్రామానికి చెందిన పలువురికి కుక్కలు కరిచి గాయపరిచినప్పుడే అధికారులు చర్యలు తీసుకుంటే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేవని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ప్రజల క్షేమం కోసం పాటుపడాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటంటూ మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో ఉన్న కుక్కలను తరలించాలని కోరుతున్నారు.

విద్యార్థినికి 'కేంబ్రిడ్జ్ ఔట్‌స్టాండింగ్ లెర్నర్స్' అవార్డు

విద్యార్థిని హన్సిని

రామచంద్రాపురం, జనవరి 28: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మంధన్ స్కూల్‌కి చెందిన 12వ గ్రేడ్ విద్యార్థిని హన్సిని కేంబ్రిడ్జ్ ఔట్ స్టాండింగ్ లెర్నర్స్ అవార్డు అందుకుంది. ఏఎస్ లెవల్‌లో ఆర్థిక శాస్త్రంలో ప్రపంచ శ్రేణి ఉత్తీర్ణురాలిగా గుర్తింపు పొందుతూ ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డుని గెలుచుకుంది. కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ఈ పురస్కారాలను అందిస్తుంది. ఈ సందర్భంగా విద్యార్థిని హన్సిని మాట్లాడుతూ తన విజయానికి పాఠశాల అందించిన సహకారం చాలా ఉందన్నారు. రుచికా టీచర్ మార్గనిర్దేశం, ప్రోత్సాహంతోనే ఈ అవార్డుని గెలుచుకున్నానన్నారు. ఔట్‌స్టాండింగ్ లెర్నర్స్ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. హన్సినికి పాఠశాల మేనేజ్‌మెంట్, ప్రిన్సిపాల్ సుర్జీత్‌సింగ్, తల్లిదండ్రులు, విద్యార్థులు అభినందించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి
- ఎస్పీ చెన్నూరి రూపేశ్
- జహీరాబాద్ సమీపంలోని పస్తాపూర్‌లో రోడ్డు భద్రతా నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన

జహీరాబాద్ సమీపంలోని పస్తాపూర్‌లో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో మాట్లాడుతున్న ఎస్పీ చెన్నూరి రూపేశ్

జహీరాబాద్, జనవరి 28: భద్రతా నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించగలుగుతామని ఎస్పీ చెన్నూరి రూపేశ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జహీరాబాద్ పట్టణ సమీపంలోని పస్తాపూర్ ఎన్ కన్వెన్షన్‌ల్ రోడ్డు భద్రతా నిబంధనలు, సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధలనలు తప్పక పాటించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు, కుటుంబ సభ్యులు తమ కోసం వెయ్యి కండ్లతో ఎదురు చూస్తుంటారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రమాదాల్లో పెద్ద దిక్కును కోల్పోతే కుటుంబ మొత్తం రోడ్డున పడుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే రోడ్డు ప్రమాదాలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలన్నారు. వాహనాలు నడిపే విద్యార్థులు తప్పనిసరిగా లైసెన్సు కలిగిన వారే నడపాలని సూచించారు. లైసెన్సు లేకుండా నడిపితే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాదులు హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని, అతివేగం అనర్థదాయకమని, మద్యం తాగి వాహనం నడపవద్దని సూచించారు. ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని హెచ్చరించారు. ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేసే ఆటోలు, జీపులు, ఇతర ప్రైవేటు రవాణా వాహనాలు పరిమితికి మించి తీసుకెళ్లకూడదని తెలిపారు. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరిగిపోయని, ఆన్‌లైన్ మోసాలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. బ్యాంకు అధికారులుగా మాట్లాడేవారిని, రుణాలు ఇస్తామని చెప్పేవారిని నమ్మొద్దన్నారు. బాల్యవివాహాలు, మహిళలు, విద్యార్థినులు, ఆడపిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే పోక్సోచట్టం కింద కేసులను నమోదు చేస్తామన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని, కళాశాలలకు, ఇంటికి వెళ్లే సమయంలో ఎవరైన ఆకతాయిలు వేధిస్తే 100కు ఫోన్ చేయాలన్నారు. వెంటనే షీ టీమ్ అక్కడికి చేరుకుని వారి పని పడుతుందన్నారు. ముఖ్యంగా ఎవరైన అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తుల సమాచారాన్ని డయల్ 100కు లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం పలువురు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో అర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, రవాణా శాఖాధికారి వెంకటయ్య, జహీరాబాద్ పట్టణ, రూరల్ సీఐలు శివలింగం, జక్కుల హనుమంతు, ఎస్ఐలు కాశీనాథ్, ప్రసాద్‌రావు, నవీన్, నారాయణ, రాజేందర్‌రెడ్డి, చల్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 28: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పట్టణ ఎస్సైలు నర్సింహులు, అక్బర్ అలీ స్పష్టం చేశారు. మంగళవారం తారా ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్, సామాజిక విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూడలి వద్ద సిగ్నల్స్ ప్రకారం వాహనాలను నడుపాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఒకే బైక్‌పై ఇద్దరి కంటే ఎక్కువమంది ప్రయాణం చేయకూడదన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వర్, ఏఎస్ఐ అన్వర్ అలీ, ఎన్ఎస్ఎస్ అధికారి సుమతీదేవి, చరిత్ర అధ్యాపకురాలు డాక్టర్ వాణి, పోలీసు సిబ్బంది, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 28: జిల్లాలో ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఇంటర్ పరీక్షల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణ కోసం 54 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. థియరీ, ప్రాక్టికల్ పరీక్షల కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 3వ తేదీ నుంచి జరిగే ప్రాక్టికల్ పరీక్షలు, జనరల్, ఒకేషనల్ కోర్సులకు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మార్చి 5వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వివరించారు. మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో 15,984 మంది విద్యార్థులు, ఒకేషనల్ పరీక్షలకు 1681 మంది, మొత్తం 17,665 మంది పరీక్షలు రాయనుండగా, ద్వితీయ సంవత్సరంలో జనరల్ విభాగంలో 17,057 మంది విద్యార్థులు, ఒకేషనల్ పరీక్షలకు 1431 మంది, మొత్తం 18,488 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వివరించారు. పరీక్షల నిర్వహణ కోసం ఏర్పాటు చేసే స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట మైన భద్రతతోపాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. పరీక్షా కేంద్రంలో సెల్ ఫోన్ నిషేధమని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన అన్ని మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఇంటర్ అధికారి గోవింద్ రామ్, వైద్యాధికారి డాక్టర్ గాయత్రీ దేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జహీరాబాద్ ఆర్టీసీ డిపోలో ప్రమాద రహిత డ్రైవర్లకు సన్మానించిన ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి

జహీరాబాద్, జనవరి 28: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలను చేర్చాల్సిన బాధ్యత ఆర్టీసీ డ్రైవర్లపై ఉందని సంగారెడ్డి ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ప్రభులత అన్నారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ భద్రతా మాసోత్సవ ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన ప్రమాదరహిత డ్రైవర్లులైన శంకరయ్య, పీఎంరెడ్డి, వినోదయ్యలకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్, బుదేరా పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మాధవి, అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, గ్యారేజ్ సూపర్‌వైజర్ తిరుమలేశ్, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పేస్కేల్స్ అమలు చేయాలంటూ జేఎన్టీయూలో నిరసన తెలుపుతున్న ఒప్పంద అధ్యాపకులు

యూజీసీ పే స్కేల్స్ అమలు చేయాలి

జేఎన్టీయూలో ఒప్పంద అధ్యాపకులు నిరసన

చౌటకూర్, జనవరి 28:మండలంలోని సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఒప్పంద అధ్యాపకులు మంగళవారం నిరసన తెలిపారు. యూజీసీ పేస్కేల్స్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఒప్పంద అధ్యాపకులు నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేపట్టారు. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో 1,445 మంది ఒప్పంద అధ్యాపకులు పని చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఒప్పంద అధ్యాపకుల సంఘం నాయకుడు డాక్టర్ సాయిచంద్ర తెలిపారు. ఉన్నత చదువులు చదివి యూనివర్సిటీనే నమ్ముకుని చాలిచాలని వేతనాలతో కుటుంబాలను పోషిస్తున్నామని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే యూజీసీ పే స్కేల్స్‌ను అమలు పరచి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

ఇటుక బట్టీల్లో క్షయ పరీక్షలు

గుమ్మడిదల, జనవరి 28: క్షయ వ్యాధి రహిత గ్రామం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్నారం గ్రామ పంచాయతీ శివారులో ఉన్న ఇటుక బట్టీల్లో మంగళవారం గుమ్మడిదల పీహెచ్‌సీ వైద్యులు క్షయ వ్యాధి నివారణ కోసం ఎక్సరే పరీక్షలు నిర్వహించారు. ఇందులో 105 మందికి ఎక్సరే పరీక్షలు నిర్వహించగా వీరిలో 16 మందికి వ్యాధి లక్షణాలు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. వారికి తెమడ పరీక్ష చేసి చికిత్స ప్రారంభిస్తామని డాక్టర్ మధుకర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రతాప్ రెడ్డి, మురళి, సంగీత, ఎంపీహెచ్‌వో శ్రీనివాస్‌రావు, రాజు, టీబీ అలర్ట్ ఆఫ్ ఇండియా జీఎం దేవేందర్, నర్సిరెడ్డి , జిల్లా టీబీ కోఆర్డినేటర్ కృష్ణ, టీబీ ఫీల్డ్ ఆఫీసర్ చందు, డా.సభ, ఎమ్మెల్ హెచ్‌పీ వసంత, ఏఎన్ఎంలు నవీన్, ఇర్ఫానా, సరిత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 28: బీసీ, దళిత, బహుజన సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం కొత్త బస్టాండ్ వద్ద కేంద్ర మంత్రి బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీర య్యాయాదవ్ మాట్లాడుతూ భూస్వామ్య దొరల ఆకృత్యాలపై , భూస్వాములపై తిరుగుబావుటకు గలమెత్తిన ప్రజా నౌక గద్దర్‌పై కేంద్ర మంత్రి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. గద్దర్‌ను హంతకుడని, హంతకుడికి పద్మశ్రీ ఇవ్వమని చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశామని చెప్పారు. బండి సంజయ్ వెంటనే క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు అనంతయ్య, అశోక్, జైపాల్ నాయక్, పోతురాజు పవన్, ప్రకాశ్ రాథోడ్, ఇమ్మయ్య, నిజాముద్దీన్, బాబర్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీసీ, దళిత, బహుజన సంక్షేమ సంఘాల నాయకులు

మున్సిపల్ అధికారులు, సిబ్బందిని సన్మానించిన మాజీ కౌన్సిలర్ గుండ్ల సుజాతామహేందర్ రెడ్డి

మున్సిపల్ అధికారులు, సిబ్బందికి సన్మానం

జిన్నారం(బొల్లారం) జనవరి 28: జిన్నారం మండలం బొల్లారం మున్సిపాలిటీ అధికారులు, సిబ్బందిని ఆరో వార్డు కౌన్సిలర్ గుండ్ల సుజాతామహేందర్ రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంగళవారం మాజీ కౌన్సిలర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో కమిషనర్ మంగతా యారుతోపాటు అధికారులు, సిబ్బంది, ఆయా విభాగాల్లో పని చేసే మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ మాట్లాడుతూ. ఐదేండ్ల ప్రజాసేవలో సంపూర్ణ సహకారం అందించిన అధికారులకు, సిబ్బందికి, మున్సిపల్ కార్మికులకు, సమస్యల పరిష్కారంలో వారథిగా నిలిచిన జర్నలిస్టులకు ధన్యవాదాలు తెలుపుతూ ఓకే వేదికపై అందరినీ సన్మానించుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం గతంలో పని చేస్తూ మృతి చెందిన పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి మాజీ కౌన్సిలర్ దంపతులు ఆర్థిక సహాయం అందించి పెద్ద మనస్సు చాటుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున్, ఆర్వో నర్సింహులు, అధికారులు, సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురం ఈఎస్ఐ దవాఖాన ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది

ఈఎస్ఐని సొసైటీగా చేయడం సరికాదు

రామచంద్రాపురం, జనవరి 28: ఈఎస్ఐని సొసైటీగా చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచన సరికాదని తెలంగాణ వైద్యుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రమేశ్ అన్నారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వం ఆలోచనకు వ్యతిరేకంగా రామచంద్రాపురం ఈఎస్ఐ దవాఖాన వైద్యులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో వైద్యుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రమేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఎస్ఐని సొసైటీగా మార్చి ప్రైవేట్‌పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని, ఈఎస్ఐని ప్రైవేట్ పరం చేస్తే ఉద్యోగులకు, కార్మికులకు ఎంతో నష్టం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈఎస్ఐని ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐని కాపాడుకోవడం కోసం కేంద్రానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. నిరసనలో డాక్టర్లు కిరణ్, బ్రిజమోహన్, ఆదిత్య, నాగరాజు, ప్రశాంత్, దవాఖాన సిబ్బంది ఉన్నారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న సిబ్బంది

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

జిన్నారం(బొల్లారం) జనవరి 28: జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కాజిపల్లి సర్వేనెంబర్ 181లో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను నేలమట్టం చేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ భిక్షపతి ఆదేశాల మేరకు మంగళవారం ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ జేసీబీ సాయంతో అక్రమ కట్టడాలను కూల్చివేయించారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

బాలవిహార్ పార్కులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్, ఉపకమిషనర్

నిధులు మంజూరు చేయాలి

రామచంద్రాపురం, జనవరి 28: ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో ఉన్న బాలవిహార్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను బల్దియా ఉపకమిషనర్ సురేశ్‌తో కలిసి కార్పొరేటర్ పుష్పానగేశ్ పరిశీలించారు. బాలవిహార్ పార్కులో సివిల్‌వర్కులు దాదాపుగా పూర్తవుతున్న తరుణంలో ప్రహరీ, ఓపెన్ జిమ్, లైటింగ్ పనుల కోసం నిధులు మంజూరు చేయించాలని ఉపకమిషనర్‌ను కోరడంతో జోనల్ కమిషనర్‌తో చర్చించి నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు. పార్కు అభివృద్ధి పనులు త్వరగా పూర్తయితే ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని కార్పొరేటర్ అన్నారు.

మురుగుతో ఇక్కట్లు

జిన్నారం(బొల్లారం) జనవరి 28: బొల్లారం 11వ వార్డు బీరప్పబస్తీలో అస్తవ్యస్తంగా ఏర్పాటు చేసిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో తీవ్ర ఇక్కట్లు ఎదురవుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలోని ఓ ప్రహరీకి ఆనుకొని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయడంతో మురుగు పొంగిపొర్లుతుందన్నారు. అధికారులు సమస్యను గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

అందోల్, జనవరి 28: పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఉపాధిహామీ సిబ్బంది మంగళవారం ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించడంతో పాటు పే స్కేలు వెంటనే అమలుచేయాలని కోరారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఉపాధిహామీ సిబ్బంది అందోల్ ఎంపీడీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. వేతనాలు, పేస్కేలు అమలు చేయని పక్షంలో శాంతియుతంగా నిరసనలు చేపడుతామన్నారు. అప్పుడు కూడా ప్రభుత్వం నుంచి స